
ప్రజాశక్తి

మంగళవారం 3 డిసెంబర్ 2024 5 విజయనగరం



విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని బిసి హాస్టల్ విద్యార్థి శ్యామలరావు మృతికి అధికారులే కారణమని, కావున ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిప్యూటీ కలెక్టర్‌కు, డిడికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం వినతినిచ్చారు. విద్యార్థి మృతికి గల కారణాలు విద్యార్థులకు, విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయక పోవడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థి కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం ఇచ్చి వారిని ఆదుకోవాలని, విద్యార్థులను బెదిరిస్తున్న వార్డెన్ జానకిరామ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సరిపడా మరుగదొడ్లు, ఇతర వసతులు కల్పించాలని కోరారు. వినతిచ్చిన వారిలో జిల్లా సహాయ కార్యదర్శి శిరీష, సుస్మిత, రాహుల్, జయ తదితరులు పాల్గొన్నారు

అన్నదాతకు వర్షం దెబ్బ

చేతికందిన పంట కళ్లెదుటే వర్షంలో తడిచి ముద్దయ్యింది. మరికొంత నేలకొరిగిపోయింది. ప్రకృతి ఆగ్రహం ముందు నిర్ఘాంతపోవడం అన్నదాత వంతైంది. ఈనేపథ్యంలో చాలా రైతు కుటుంబాలకు నష్టం వాటిల్లి లబోదిబోమంటున్నాయి. నిన్నటి వరకు రెల్లరాల్చుపురుగు వరి వెన్నుపీక నొక్కి తీవ్ర నష్టాన్ని కలిగించిందని, ఇప్పుడు కురుస్తున్న అకాల వర్షం చేతికందిన పంటను నేలపాలు చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 1100 ఎకరాల్లో తడిసి ముద్దయిన వరిచేలు
- నేలకొరిగింది 140 ఎకరాలకు పైమాటే
- ఆందోళనలో రైతులు

తడుస్తున్న వరిచేలు

వంగర : మండలంలోని మద్దివలస, కొప్పరవలస, కొత్తవలస, వంగర తదితర గ్రామాలలో రైతులు ఇటీవల కోసిన వరి చేలును పొలాల్లోనే కుప్పలుగా వేశారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న తేలికపాటి వర్షానికి కొంతమంది రైతులు వరికుప్పలపై టార్పాయిన్లు కప్పి తమ పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రుషింగి, చిన రాజుల గుమ్మడ, పెద్ద రాజుల గుమ్మడ, వివిఆర్‌పేట గ్రామాలలో కోసిన వరిచేలు ఓవులుగా పొలాల్లోనే ఉండిపోవడంతో కురుస్తున్న వర్షానికి తడిసి పంట నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



భోగాపురం.. పొలంలో చేరిన నీరు



వంగర.. వర్షంతో తడిచిన వరిచేను

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఈఏడాది 2,45,533 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 1,84,130 ఎకరాల్లో ఇప్పటివరకు కోతలు పూర్తయ్యాయి. మిగిలిన పంట కోతకు సిద్ధంగా ఉంది. ఈనేపథ్యంలో గత మూడు రోజులుగా కుస్తున్న వర్షాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం... కోసిన పంటలో 1,46,022 ఎకరాల మేర పొలాల్లోనూ, కళ్లాల్లోనూ కుప్పలు పెట్టారు. మిగిలిన చేనులో సుమారు 1.095 ఎకరాలు వరిచేను ఓవులుగా ఉన్నాయి. భారీ వర్షాలు కాకపోయినా ఎడతెరిపి ఇవ్వకుండా చినుకులు రాలుతుండడంతో ఇప్పటికే తడిసి ముద్దయిన చేను దిబ్బలు పెట్టుకునేందుకు అవకాశం లేకపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలా తడిచిన చేను దిబ్బలు పెట్టడం వల్ల నష్టం మరింత పెరుగుతుందని చెబుతున్నారు. ఓవులు రూపంలో తడిచిన చేను విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో అత్యధికంగా 848 ఎకరాల్లో ఉంది. ఈ రకమైన నష్టం బొండపల్లి, జామి, పూసపాటిరేగ, ఎస్.కోట, విజయనగరం, నెల్లిమర్ల మండలాల్లో ఎక్కువగా ఉంది. జిల్లా వ్యాప్తంగా మరో 140 ఎకరాల్లో వరిచేను నేలకొరిగింది. ఈ రకమైన నష్టం ఎక్కువగా ఎస్.కోట, విజయనగరం, రాజాం మండలాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. గత మూడు రోజుల్లో గుర్ల, నెల్లిమర్ల మండలాల్లో 46 మిల్లీ మీటర్లు, భోగాపురంలో 43 మి.మీ చొప్పున అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈనేపథ్యంలో గుర్ల మండలంలోనే సుమారు 200ఎకరాలకు పైగా వరి పంట పూర్తిగా తడిచిపోయినట్టుగా గుర్తించారు. ఇదే మండలంలోని సతివాడ, ఆ చుట్టు పక్కల ప్రాంతంలో పంట పొలాల్లో నీరు కూడా చేరింది. దీంతో, ఈ మండలంలో పంట నష్టం ఎక్కువగా జరిగే అవకాశం ఉందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇలా దాదాపు అన్ని మండలాల్లోనూ అకాల వర్షం వల్ల నష్టం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

దిగుబడి పెరిగినా తప్పని నష్టం

వాస్తవానికి ఈ ఏడాది మునుపటి కంటే దిగుబడి ఆశా జనకంగానే కనిపించింది. ఎకరాకు 2,317 కేజీల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు లెక్కకడుతున్నారు. క్షేత్ర స్థాయి పరిస్థితి కూడా ఇందుకు అద్దం పట్టే విధంగా కనిపించింది. దీన్నిబట్టి 75కేజీల బరువుగల బస్తాలు 31వరకు వస్తాయన్నమాట. ప్రయోగాలు పూర్తయ్యేనాటికి కనీసం 29బస్తాలు, అంటే గతం కన్నా ఒక బస్తా దిగుబడి అయినా పెరుగుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో నిన్నమొన్నటి వరకు రెల్ల రాల్చు పురుగు నష్టాన్ని కలిగించగా, తాజాగా అకాల వర్షాలతో చేను తడిచిపోయింది. దీంతో, నష్టం జరుగుతుందని రైతులు భీతిల్లుతున్నారు.

కురిసిన వర్షం తక్కువైనా నష్టం ఎక్కువే

వాస్తవానికి గడిచిన మూడు రోజులపాటు గుర్ల, నెల్లిమర్ల, భోగాపురం మండలాల్లో మినహా మిగిలిన చోట్ల పెద్ద వర్షాలేమీ లేవు. జిల్లా సగటు వర్షపాతం 25.8 మీ.మీగా నమోదైంది. వర్షం కురిసేనాటికే వాతావరణం చల్లగా ఉండడం, చేను ఆరకుండా కుప్పలు పెట్టే అవకాశం లేకపోవడం వంటి కారణాల వల్ల చేను పొలంలోనే పరిచి వదిలేశారు. తాజాగా కురిసిన వర్షాలతో మరింత నెమ్ముకోవడంతో ప్రస్తుతం ఎండ కాస్తే తప్ప, వాటిని కుప్పలు పెట్టే పరిస్థితి లేదు. ఇలా వరి రైతుకు నష్టం వాటిల్లుతోంది.



భోగాపురం.. నేలకొరిగిన వరిచేను

260 ఎకరాల్లో దిబ్బలుగా వరిచేను

భోగాపురం : మండలంలో 260 ఎకరాల్లో కోసిన వరి చేనును పొలాల్లో కుప్పలు వేసి ఉంచినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ వరి పొలాలను సోమవారం పరిశీలించారు. మండలంలో సుమారు 1500 ఎకరాల్లో ఈ ఏడాది వరి పంటను వేశారు. పంట చేతికి వచ్చే సమయానికి ఫెంగల్ తుపానుతో రైతుల కొంత ఆందోళనకు గురయ్యారు. చాలాచోట్ల కోసిన వరి చేను పొలాల్లోనే కుప్పలు పెట్టకుండా ఉండిపోయింది. మరి కొంత వరిచేను తేలికపాటి గాలులకే నేలకొరిగింది. నేల వాలిన వరి చేను పొలంలో నీటిని బయటకు పంపిస్తే ఎటువంటి నష్టం వాటిల్లదని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. పనలతో పొలంపై ఉన్న వరిచేనుకు ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయడం వల్ల మొలకలు రాకుండా నివారించవచ్చునని అధికారులు చెబుతున్నారు. సుమారు 280 ఎకరాలు కోతకు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. తుపాను ముగిసిన తర్వాత ధాన్యం కొనుగోలు మొదలవుతుందని అంతవరకు జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచిస్తున్నారు.

తుపానుతో పంటకు ముప్పు

గుర్ల : తుపాను ప్రభావం వల్ల మండలంలో మోస్తరు వర్షాలు కురవడంతో వరి పంటకు ముప్పు వాటిల్లింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందే సమయంలో తెగుళ్ల బెడద, ప్రకృతి వైపరీత్యాలు వల్ల ఫలసాయం అందక రైతులు నిరాశకు గురవుతున్నారు. ఎంత కష్టమైనా, పెట్టుబడులు పండించినా, పండిన పంట చేతికి అందక పోవడంతో రైతుల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొంతమంది రైతులు పంట కోసి చిన్న చిన్న కుప్పలుగా వేసుకున్నారు. కోసిన వరి పంట పొలంలోనే ఉండడంతో తుపాను వానలకు నీట మునుగుతుంది. మండలంలో 10 వేల ఎకరాలలో వరి సాగు చేసినట్లు వ్యవసాయ అధికారి తిరుపతి రావు తెలిపారు. గోషాడ, పాలవలస గ్రామాల్లో నీటి మునిగిన, తడిచిన వరి పంటను ఆయన సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లడుతూ కోతకోసి ఉన్న పంట మడి లో ముంపుగా ఉన్న నీరును కిందకి తీసి వేసి వరి పనుల పై ఉప్పు నీటి ద్రావకాన్ని పిచికారీ చేయాలన్నారు. ఇలా చేస్తే మొలకలు రాకుండా ఉంటాయన్నారు. ప్రాథమికంగా మండలో 200 ఎకరాలలో వరి పంట దెబ్బతిన్నట్లు ఆయన అంచనా వేశారు.



గుర్ల.. తడిచిన వరిపనలను చూపిస్తున్న రైతులు

పంట పొలాలు పరిశీలన

మండలంలో పాలవలస గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు సుంకరి రమణ మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట చేతికి అందే సమయంలో ఇలాంటి విపత్తులు రావడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రభుత్వ పెద్దలు దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరుతామన్నారు.

రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు

ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ● వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో సుమారు రూ.300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఈ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ఉపాధిహామీ కింద జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి శ్రీనివాస్ సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. డ్వామా, రాజీవ్ విద్యామిషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ తదితర శాఖల వారీగా పనులను, ఇసుక సరఫరా, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద చేపట్టిన రహదారులు, కాలువలు, గోకులాల నిర్మాణం తదితర పనుల ప్రగతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మంత్రికి వివరించారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే జిల్లాలో చేపట్టిన సుమారు రూ.200 కోట్ల విలువైన 2165 పనులను మంజూరు చేయగా, వీటిలో ఇప్పటివరకు 184 పనులు పూర్తి అయ్యాయని, ప్రగతిలో ఉన్న పనులను జనవరి మొదటి వారానికి పూర్తి చేస్తామని చెప్పారు. రెండు దశల్లో 1091 గోకులాలను మంజూరు చేశామని, 820 పనులు ప్రారంభం అయ్యాయని, వీటి నిర్మాణం కూడా వారం రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రెండు రోజుల్లోగా తీర్మానాలను పూర్తిచేసి, తమకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల చేస్తామని, 8న ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సుమారు రూ.200 కోట్లమేర పనులను చేపట్టామని, అందుబాటులో ఉన్న మరో రూ.50 కోట్లతో నియోజక వర్గానికి రూ.10 కోట్లు చొప్పున పెద్ద తారురోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సుమారు రూ.23కోట్లతో గోకులాల నిర్మాణానికి ప్రతిపాదించామని, వీటిని త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. చెక్ డ్యాములను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అభివద్ధి పనులకు ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ నియోజకవర్గంలో వారానికి సుమారు రూ.3కోట్ల విలువైన బిల్లులు చెల్లించాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, సుమారు రూ.250 కోట్ల విలువైన మెటీరియల్ కాంపోనెంట్ పనులను ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా వెండార్స్ ద్వారా ఈ పనులను చేపట్టామని చెప్పారు. గ్రామ సభల్లో తీర్మానించిన పనులనే చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో డ్వామా ఇన్‌ఛార్జ్ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.శ్రీనివాస్, ఇతర అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టు పట్ల అప్రమత్తం

- ఐదుగురు నిందితులు అరెస్టు
- రూ.10 లక్షలు నగదు, రూ. 9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు రికవరీ
- కేసును ఛేదించిన పోలీసులకు ఎస్‌పి అభినందనలు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం వన్ టౌన్ పోలీసు స్టేషను పరిధిలో నమోదైన సైబరు క్రైం (డిజిటల్ అరెస్టు) కేసును ఛేధించి, ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.10 లక్షల నగదు, రూ. 9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నిందితులు వినియోగిస్తున్న ఆరు సెల్ ఫోన్లును రికవరీ చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విజయనగరానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ ఉసిరికల సుజాత కుమారికి అక్టోబర్ 10న గుర్తు తెలియని ఒక వ్యక్తి ఫోను చేసి, తాము పోలీసులమని, తాము పంపిన పార్సిల్లో డ్రగ్స్ ఉన్నట్లుగా కనుగొన్నామని, తమని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, డిసిపి స్థాయి అధికారి కేసు విచారణ చేస్తున్నారని, తమ బ్యాంకు అకౌంటులో ఉన్న డబ్బులను వెంటనే తాము సూచించిన బ్యాంకు అకౌంటుకు పంపాలని, బ్యాంకు లావాదేవీలను వెరిఫై చేసిన తరువాత, తిరిగి మొత్తాన్ని తమ బ్యాంకు అకౌంటుకు పంపుతామని బెదిరించారు. దీంతో నిందితులు సూచించిన బ్యాంకు ఖాతాకు ఆమె రూ.40,11,000 పంపారు. అప్పటినుండి నిందితుల మొబైల్ ఫోను చేసినట్లుగా వన్ టౌన్ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చెయ్యగా, పోలీసు కేసు నమోదు చేసారు. పోలీసుల సూచనలతో ఫిర్యాది సైబరు క్రైం పోర్టల్‌లో సకాలంలో ఫిర్యాదు చేయడంతో నిందితుల ఖాతాలో రూ. 20 లక్షలు ఫ్రీజ్ అయ్యాయి. ఎస్‌పి ఆదేశాలతకు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఫిర్యాది ఖాతా నుండి నిందితుల ఖాతాలకు జమైన నగదు వివరాలు ప్రకారం, సాంకేతిక పరిజ్ఞానానికి వినియోగించి, నిందితులను గుర్తించారు. ఈ కేసులో జమ్ము కాశ్మీర్‌కు చెందిన (ఎ-1) ముమిన్ తారిఖ్ భట్ (33)ను అరెస్టు చేసి, విచారణ చేయడంతో తన బ్యాంకు ఖాతాను కొంతమంది సైబరు నేరగాళ్ళకు అద్దెకు ఇచ్చినట్లు, తన అకౌంటులో పడిన డబ్బులను 5 నిమషాల వ్యవధిలోనే విత్ డ్రా చెయ్యడం లేదా వేరువేరు బ్యాంకు ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేయడం చేస్తుంటానని, అందుకు తనకు 3శాతం కమీషను ఇస్తారని తెలిపారు.నిందితుడు ఇచ్చిన సమాచారంతో వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్, ఇతర పోలీసు బృందం మహారాష్ట్ర వెళ్ళి, డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించారు. ఈ ముఠా టెలిగ్రాం యాప్ ద్వారా గ్రూపుగా ఏర్పడి, దేశ వ్యాప్తంగా ఇదే తరహాలో డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడుతూ, పెద్ద మొత్తంలో డబ్బులను దోచుకుంటున్నారు. ఈనేపథ్యంలో తారిఖ్‌భట్‌తో పాటు నిందితులు ఖసిద్ధి చంద్రకాంత్ సుతార్ (24), క్లైవిన్ గ్లెన్ బ్రిట్టో (21), నితిన్ నందలాల్ సరోజ్ (23), సైఫ్ తలమీ దమండ్ (31) అనే మహారాష్ట్రలోని ముంబయి, పూణేకు చెందిన నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసేందుకు నిఘా పెట్టామని తెలిపారు. ఈ కేసులో రికవరీ చేసిన మొత్తంతోపాటు, ఫిర్యాది సకాలంలో స్పందించిన కారణంగా నిందితుల బ్యాంకు ఖాతాల్లో మరో రూ.22 లక్షలను ఫ్రీజ్ చేశామన్నారు. డిజిటల్ ఆరెస్టు పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, సైబరు మోసగాళ్ళ బెదిరింపులకు లొంగొద్దని, స్థానిక పోలీసు స్టేషనులో లేదా 1930 లేదా సైబరు క్రైం పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కేసు ఛేదనలో సమర్ధవంతంగా పని చేసిన వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐ వి.ఎల్. ప్రసన్న కుమార్, కానిస్టేబుళ్ళు వి. రవి శంకర్, ఎస్. రవి కిషోర్, కే.సన్యాసి నాయుడు, వై.రామరాజును ఎస్‌పి అభినందించి, ప్రశంసా పత్రాలను ప్రదానం చేసారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాకే వినతుల పరిష్కారం

వర్షాలకు దెబ్బతిన్న వరి పంట వివరాలను వెంటనే సమర్పించాలి : కలెక్టర్ అంబేద్కర్ ● పిజిఆర్ఎస్ కు 116 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను క్షేత్ర స్థాయి లో పరిశీలించిన తర్వాతనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులకు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి పిజిఆర్ఎస్ విశ్లేషణ నివేదిక అందిందని, వినతులకు తెలుగు లోనే సమాధానాలు రాయాలని తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ లో కలెక్టర్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. అంతకు ముందు అధికారులతో మాట్లాడుతూ జిల్లా వినతుల ఆడిట్ టీం వినతుల పరిష్కారంపై సమీక్షిస్తుందని , జిల్లాకు చెందిన 95 శాతం వినతులను పరిశీలించి అర్జీ దారులతో మాట్లాడామని తెలిపారు. వచ్చే సోమవారం నాటికి ఏ శాఖ వద్దనైనా పెండింగ్ ఉన్నా, రీ ఓపెన్ కేసు లున్నా చర్యలు తప్పవని తెలిపారు.



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

సోమవారం పిజిఆర్ఎస్ కు 116 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఓ ఇంచార్జ్ సుధారాణి, డిప్యూటీ కలెక్టర్ మురళీ కృష్ణ ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 116 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 76 వినతులు అందాయి. హై కోర్ట్, జిల్లా కోర్టుల్లో ఫైల్ అయిన కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి, కంటెంప్ట్ లు పడకుండా అవసరమగు కౌంటర్లను వేయడానికి జిల్లా స్థాయి లీగల్ సెల్ ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పంటనష్టం వివరాలను వెంటనే సమర్పించాలి

గత మూడు రోజులుగా జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బ తిన్న వరి పంట వివరాలను రెండు రోజులో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కోతలు కోసి పొలాల్లో పనలుగా ఉన్న పంట ఎంత ఉంది, నూర్చిన ధాన్యం ఏమైనా ఉన్నాయా, గ్రామ, మండల వ్యవసాయ అధికారులు, తహశీల్దార్లు పొలాలకు వెళ్లి పరిశీలించి నివేదిక ఇవ్వాలని తెలిపారు.

భూ పట్టాలు ఇవ్వండి

సాగు చేసుకుంటున్న ఫారెస్ట్ భూమిపై మాకు హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని మెంటాడ మండలం ఆగూరు రెవెన్యూ గిరిజన సాగుదారులైన సంఘం గుడ్డి వలస, కింద గూడెం, పనుకువాని వలస, సిడగంవలస, రాయవలస, ఎర్రడ వలస గిరిజనులు సోమవారం అధికారులకు వినతులిచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన గ్రామ అధ్యక్షుడు సిడగం చిన్నయ్య, జిల్లా కమిటీ సభ్యులు సిడగం బాలరాజు మాట్లాడుతూ గిరిజన భూములు కబ్జా కు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రికార్డులు తారుమారు చేసిన మెంటాడ మండలం తాహల్దార్ పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకోటి రాములు, బి.నాగేశ్వరరావు, వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ హాళ్లు ఏర్పాటు చేయాలి

విజయనగరం టౌన్ : నిరుద్యోగులు చదువుకునేందుకు వీలుగా ప్రభుత్వం నగరంలో స్టడీ హాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రైవేటు రీడింగ్ రూముల ఛార్జీలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ అధికారులను కోరారు. ఈమేరకు గ్రీవెన్సులో సోమవారం జాయింట్ కలెక్టర్‌కు సేతు మాధవన్‌కు వినతి అందజేశారు. గ్రామాలను వచ్చిన వేలాది మంది నిరుద్యోగులు నగరంలోని రీడింగ్ రూముల్లో డబ్బులు చెల్లిస్తూ చదువుకుంటున్నారని, వీటిలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. రీడింగ్ రూములు ఫీజులు తగ్గించి.. ప్రభుత్వమే నిరుద్యోగులు చదువుకోవడానికి ప్రత్యేకమైన స్టడీ హాల్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పైపులైను పనులు పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నెల్లిమర్ల వాటర్ వర్క్స్ నుండి వచ్చే ప్రధాన పైపులైను ఊటగెడ్డ వద్ద మరమ్మతులకు గురవడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆదివారం ఉదయం ప్రధాన పైపులైను మరమ్మతులకు గురి కావడంతో నగరంలోని కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ పైపులైను 1912 సంవత్సరంలో క్యాస్ట్ ఐరన్ తో తయారు చేసినదన్నారు. అటువంటి పైపులైను విశాఖపట్నం నుండి తెప్పించామని, వాటిని అమర్చే మెకానికల్ జాయింట్‌ను హైదరాబాదు నుండి తెప్పిస్తున్నామని, రేపటికల్లా మరమ్మత్తులు పూర్తిచేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందుకోసం 95502 99664 ఎఇ నెంబర్‌కు సమాచారం అందించి ట్యాంకర్ల ద్వారా నీటిని పొందవచ్చునని చెప్పారు.



పైపులైను పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, చట్టపరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 25 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, డిసిఆర్‌బి ఎస్ఐ రాజేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెటరన్ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణంనాయుడు ప్రతిభ

ఇటీవల మహారాష్ట్ర రాష్ట్రం నాసిక్ లో జరిగిన 3వ జాతీమ స్థాయి వెటరన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో ప్రతిభ కనబర్చిన విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో హెడ్ కానిస్టేబులుగా పని చేస్తున్న వాళ్ళె కష్ణం నాయుడును ఎస్‌పి వకుల్‌జిందాల్ అభినందించారు. అక్టోబరు 23 నుండి 27 వరకు మహారాష్ట్ర రాష్ట్రం నాసిక్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చి నాలుగు బంగారు పతకాలు, ఒక సిల్వర్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన కృష్ణం నాయుడు మర్యాద పూర్వకంగా ఎస్‌పిని కలవగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆయనను ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్ఐ వి.అశోక్ కుమార్ తదితరులు అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

పిఎం స్వానిధిలో మరో అవార్డుకు కృషి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రధానమంత్రి స్వానిధి పథకం అమలులో మరోసారి అవార్డు పొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బ్యాంకర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. సోమవారం బ్యాంకర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది కూడా మంచి ప్రతిభ కనబరిచి అవార్డు లభించే విధంగా కృషి చేయాలన్నారు. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లో లేకుండా అన్నీ పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. రుణ చెల్లింపుల్లో ఇబ్బందులను తమ దృష్టికి తెచ్చినట్లయితే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. రుణమంజూరులో బ్యాంకర్లు సహకరించాలని కోరారు. తక్షణమే దరఖాస్తులను పరిశీలించి బ్యాంకర్లకు అందివ్వాలని కమ్యూనిటీ ఆర్గనైజర్లకు సూచించారు. సమావేశంలో టిపిఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శంకుస్థాపనలు చేశారు. పుణ్యగిరి, యడ్ల వీధి, ఎస్‌సి కాలనీల్లో రూ.25 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయిన్లు సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి కష్టాలు, తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జివిఎస్ నాయుడు, జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, టిడిపి నాయకులు మల్లేశ్వరరావు, పొన్నూరు సాయిరాం, అప్పలరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు ఇందుకూరి శ్రీనురాజు, కాపుగంటి వాసు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలో సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు ఇస్తున్న రేషన్ సరుకులను అక్రమంగా తరలించడం దుర్మార్గమన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నా, కఠిన చర్యలు లేకపోవడంతో యథేచ్ఛగా సాగుతోందని తెలిపారు.

ప్రారంభమైన ఎంఎస్ఎంఇ సర్వే

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో ఎంఎస్ఎంఇపై సర్వే సోమవారం ప్రారంభమైందని ఎంపిడిఒ భాస్కరరావు తెలిపారు. ఇందులో భాగంగా గర్భాం రెండు సచివాలయాల సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఉన్న సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల వివరాలు నమోదు చేసే ప్రక్రియ ఈ సర్వే ద్వారా గ్రామ సచివాలయాల ఉద్యోగులు చేస్తారన్నారు. సిబ్బందికి డెమో సర్వే చేసి వివరించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ సమీక్షించారు. పల్లె పండుగ పనులు పురోగతి, అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, శానిటేషన్ సర్వే, తదితర వాటిపై సమీక్షించారు. పనులకు సాంకేతిక సహాయం అందించాలని ఆయన సూచించారు. మరుగుదొడ్లు మంజూరు చేసే అవకాశం ఉందని, అర్హులను గుర్తించాలని ఆదేశించారు.

యువత సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ఐటిఐ కాలనీలో యువత సహకారంతో పోలీసులు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. కాలనీలో నేరాలను నివారించేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ చెప్పారు. వాటి ఏర్పాటుకు సహకరించిన యువతను సిఐ అభినందించారు.

నేడు వికలాంగులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి- డెంకాడ

ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రం వద్ద 18 సంవత్సరాల లోపు పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు భవిత పాఠశాల ఉపాధ్యాయుడు రవీంద్ర తెలిపారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండలంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరూ 18 సంవత్సరాల లోపు వికలాంగులను భవిత విద్య వనరుల కేంద్రం వద్దకు 9 గంటలకు పంపించాలన్నారు. వీరికి డ్రాయింగ్, నృత్యం, రన్నింగ్ మొదలగు పోటీలు నిర్వహిస్తామన్నారు. వికలాంగులు వారి తల్లిదండ్రుల సహాయంతో మండల పరిషత్ వద్ద ఉన్న భవిత విద్యా వనరుల కేంద్రానికి రావాలన్నారు. గెలుపొందిన వారికి మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదగా బహుమతులు అందజేస్తామన్నారు.

ప్రసాద్‌కు శిష్టకరణ సేవారత్న అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శిష్టకరణాల అభ్యున్నతికి సేవ చేస్తున్న టి.ప్రసాద్ పట్నాయిక్‌కు ఈనెల 7న సేవారత్న అవార్డును హైదరాబాద్‌లో శిష్టకరణం ఐక్యవేదిక, శిష్టకరణం లేఖ సంయుక్తంగా అందజేయనున్నాయి. శిష్టకరణాలతోపాటు సమాజంలో ఉన్న ఇతర కులాల వారికి కూడా సామాజికంగా, ఆర్థికంగా సహాయం చేస్తూ వారి అభ్యున్నతికి పాటుపడే మదర్ తెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్, శిష్టకరణం లిఫ్టింగ్ హ్యాండ్ సంస్థ ద్వారా చేయూతనందిస్తున్న, సంస్థల అధ్యక్షుడైన త్యాడ ప్రసాద్ పట్నాయక్‌కు ఈఏడాది ఈ అవార్డును అందజేయనున్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలో బలిఘట్టం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎడి విజయ, టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, జనసేన నాయకులు గొరపల్లి రవి, కొరుపోలు అప్పారావు, వేంపల అప్పారావు, రత్నాజి, ఒరిస్సా నాయుడు, కొరుపోలు సూరి, లెంక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అనుపోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో సోమవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఎంపిటిసి గొంప తులసి దంపతుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ దంపతులు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు జి.భారతి, టిడిపి మండల నాయకులు హాజరయ్యారు. భారీగా మందుగుండు సామగ్రి కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



అనుపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే లలితకుమారి, గొంప కృష్ణ తదితరులు

అంగన్వాడీ ఆయా తొలగింపు అన్యాయం

- కలెక్టరేట్ వద్ద రామన్నపేట గ్రామస్తుల ధర్నా
- రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గజపతినగరం ఐసిడిఎస్ సెక్టార్ పరిధి రామన్నపేట అంగన్వాడీ ఆయాను మానాపురం సౌజన్యను అక్రమంగా తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, ఐసిడిఎస్ పీడీ, సిడిపిఒలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద బాధితురాలితో పాటు ఆ గ్రామస్తులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్ మాట్లాడారు. కేవలం రాజకీయ నాయకులు సిఫార్సులు కారణంగానే అంగన్‌వాడీ హెల్పర్ సౌజన్యను తొలగించారని అన్నారు. ఇందుకు పీడి, సిడిపిఒ చూపుతున్న కారణాలు పూర్తి విరుద్ధంగా ఉన్నాయన్నారు. 2022 అక్టోబర్ 10 న ప్రస్తుత పీడీ, సిడిపిఒ సౌజన్యను హెల్పర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, ఆ సందర్భంలో అన్ని సర్టిఫికెట్లూ పరిశీలించారని తెలిపారు. ఇపుడు ఆధార్ కార్డు పెట్టలేదని, స్థానికరాలు కాదని చెప్పి ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు. రాజకీయ వత్తిడికి తలొగ్గి ఆయాను తొలగించిన పీడీ, సిడిపిఒల పై తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ధర్నాలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, ఆయా సౌజన్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రామన్నపేట గ్రామస్తులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు

క్షయ నిర్మూలనకు వంద రోజుల ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరంకోట

క్షయ వ్యాధి (టిబి) నిర్మూలనకు రాష్ట్రవ్యాప్తంగా 100 రోజుల విస్తత ప్రచార కార్యక్రమానికి విజయనగరం జిల్లా నుంచే శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 7న ప్రారంభించి మార్చి 17 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమానికి సంబంధించి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్‌జిఒలు, వైద్యాధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, క్షయ నివారణకు వివిధ శాఖల సమన్వయంతో విస్తత ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 7వ తేదీన జిల్లాలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, దీనిలో ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, సిహెచ్‌ఒలు, ఎంఎల్‌హెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, పిహెచ్‌సి డాక్టర్లతోపాటు, మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ప్రతీవారం ర్యాలీల ద్వారా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని డిఇఒ, ఆర్ఐఒలకు సూచించారు. పరిశ్రమల్లో కార్మికులకు, ఐసిడిఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు, జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ, పిహెచ్‌సి పరిధిలో మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించి, వారి ద్వారా గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. ఎంఎల్‌సి డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ, వ్యాధి సోకిన తరువాత నిర్మూలించడం కంటే, సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంపై అవగాహన కల్పించాలని సూచించారు. టిబి నిర్మూలనా కార్యక్రమం జాయింట్ డైరెక్టర్ టి.రమేష్ మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో, జిల్లాలో టిబి వ్యాధి పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ కె.రాణి, డబ్ల్యుహెచ్‌ఒ కన్సల్టెంట్లు డాక్టర్ మహేష్, డాక్టర్ ప్రియదర్శిని, పలువురు వైద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జాయింట్ డైరెక్టర్, డిఎంహెచ్ఒ

విద్యుత్తు సబ్సిడీ కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి-గజపతినగరం

దళిత, గిరిజనులకు విద్యుత్తు సబ్సిడీ కొనసాగించాలని సోమవారం స్థానిక విద్యుత్తు శాఖ కార్యాలయం ఎదుట సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సబ్సిడీని అస్తవ్యస్తంగా అమలు చేసి, వేలాది రూపాయలు పిండేందుకు దళిత, గిరిజనులపై ఒత్తిడి చేయడం దారుణమన్నారు. బంగారంపేట, భూదేవిపేట, పాతబగ్గాం దళితులు, గిరిజనులను విద్యుత్తు సబ్సిడీ కొనసాగించాలని డిమాండ్‌చేశారు. వీరిపై ఒత్తిడి చేసి, వేలాది రూపాయలు వసూలు చేయాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, నాయకులు రాము, బాధితులు టి.కృష్ణ, లక్ష్మణ, కె.రాములు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, దళితులు



సర్పంచ్ ఈశ్వరరావు ఆధ్వర్యాన రోడ్డు వేస్తున్న కూలీలు

సారికలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అస్తవ్యస్తంగా రోడ్లకు మోక్షం లభిస్తోంది. ఉపాధి హామీ నిధులు విడుదల చేయడంతో సారిక గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్లు బాగు చేసుకుంటున్నట్లు సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాల్లో రోడ్లను పూర్తిగా నిర్వీర్యం చేసిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.42 లక్షలు విడుదల చేయడంతో వివిధ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఎస్‌సి శ్మశానవాటికకు

శ్మశానవాటికకు రోడ్డు నిర్మాణం

సిసి రోడ్డు, డ్రెయిను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రామనారాయణం నుంచి రోడ్డు, డ్రెయిన్లు, గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 15లోగా పనులు పూర్తిచేసేందుకు శరవేగంగా చేపడుతున్నట్లు చెప్పారు. ఈ పనులను సర్పంచ్ ఈశ్వరరావుతో పాటు నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గండ్రేటి సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.



ఎంపిడిఒకు వినతి అందిస్తున్న పాలవలస గౌరు, రైతులు

భూసమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-బాడంగి

గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో తలెత్తిన భూసమస్యలను పరిష్కరించాలని గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యాన కామన్నవలస రైతులు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ సుధాకర్‌కు వినతి అందించారు. ఇష్టానుసారంగా సర్వే చేయడంతో రెండేళ్లుగా భూముల క్రయవిక్రయాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గౌరు తెలిపారు. ఈవిషయమై సచివాలయానికి, తహశీల్దార్ కార్యాలయానికి విన్నవించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. వెంటనే సమస్య పరిష్కారం కాకుంటే, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు కొల్లి బంగారినాయుడు, కొల్లి జోగినాయుడు, బోను కొండయ్య, బోను అప్పలనాయుడు, బోను పైడియ్య, పెంట రామకృష్ణ, లాల కొత్తయ్య, లాల రాము, నీలబోను శ్రీను, నీలబోను అప్పలస్వామి ఉన్నారు.

అధికారులను మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

గ్రీవెన్స్‌లో కుమిలి సర్పంచ్ ఫిర్యాదు

ప్రజాశక్తి పూసపాటిరేగ

మండలంలోని కుమిలి గ్రామానికి తానే సర్పంచ్ నంటూ అధికారులను, ప్రజలను మాజీ సర్పంచ్ దల్లి ముత్యాలరెడ్డి మోసం చేస్తున్నారని ప్రస్తుత సర్పంచ్ మామిడి అప్పయ్యమ్మ సోమవారం ఎంపిడిఒ, తహశీల్దార్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. లెటర్ హెడ్లపై సర్పంచ్‌ని అని తన పేరు కింద కొట్టించుకుని అధికారులకు లేనిపోని ఫిర్యాదులు చేస్తున్నాడన్నారు. కొత్తగా, జిల్లాకు, మండలానికి వచ్చిన అధికారులకు తెలియక ఆయనే సర్పంచ్ అని లెటర్ హెడ్‌పై చూసి అనుకుంటున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. తాను దళిత సర్పంచ్ గనుకనే తనను సర్పంచ్‌గా లెక్కల్లోకి తీసుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటికీ ఆయనే సర్పంచ్ అని చెప్పుకోవడం బాధాకరమన్నారు. వెంటనే ఎంపిడిఒ రాధిక స్పందించి కుమిలి కార్యదర్శికి సమాచారం అందించారు. మాజీ సర్పంచ్ దల్లి ముత్యాలరెడ్డి సర్పంచ్‌గా లెటర్ హెడ్లపై రాయించుకోవడం, ఫిర్యాదులు చేయడం తప్పన్నారు. దీనిపై జెసి కూడా స్పందించారన్నారు. ఆయన్ని హెచ్చరించి ఇకపై అలాంటి పొరపాట్లు చేయకూడదని చెప్పాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉప సర్పంచ్ గుజ్జు సురేష్ రెడ్డి, పూసపాటిరేగ సర్పంచ్ టొంపల సీతారాం తదితరులు ఉన్నారు.

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - గుర్ల

గ్రామాలాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామమల్లిక్ నాయుడు అన్నారు. సోమవారం గూడెం, పున్నపురెడ్డి పేట గ్రామాలలో పల్లె పండగ వారోత్సవాలలో భాగంగా సీసీ రోడ్డు, కాలువ పనులకు ఆయన భూమి పూజ చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. టిడిపి మండల నాయకులు చనమల మహేశ్వరరావు, జి.రామునాయుడు, మండల అప్పలనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోళ్లఫారాలను తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని రామన్నపాలెం గ్రామానికి ఆనుకొని ఏర్పాటుచేసిన కోళ్ల ఫారాలు తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో తహశీల్దార్ అరుణకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ రామన్నపాలెం గ్రామానికి ఆనుకొని ఉన్న కోళ్లఫాంతో దుర్గంధాన్ని గ్రామస్తులు భరించలేక పోతున్నారని, రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై కిల్తంపాలెం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. పెద్దకండేపల్లికి చెందిన దళితులకు ఇచ్చిన డి-పట్టా భూమిలో కోళ్లఫారాన్ని ఏర్పాటుచేశారని చెప్పారు. డి-పట్టా భూమిని అమ్మడం, కొనడం చట్ట విరుద్ధమన్నారు. అధికారులు స్పందించి జనావాసాల మధ్య ఉన్న కోళ్ల ఫారాన్ని తొలగించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కుంచి పెద్ద రమణ, జామి ఈశ్వరమ్మ, కె.లక్ష్మి, కె.దాసు, కె.చిన్నరమణ, కె.ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు : మంత్రి

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రి నిర్మాణాలను పరిశీలించారు. ఎన్‌సిసి కాంట్రాక్టరుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి పాలనలోనే వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని రూపకల్పన చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం రూ.కోటి 30 లక్షలతో నిర్మిస్తున్న మొదటి బ్లాక్‌ను పూర్తిగా మౌలిక సదుపాయాలతో మార్చి నాటికి పూర్తిచేయాలన్నారు. సత్వరమే పోస్టుమార్టం గదిని పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్, వైద్య విధాన పరిషత్ డిఇ నరేంద్రనాథ్, కాంట్రాక్టరు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్, పివివి గోపాలరాజు, వి.ప్రదీప్‌కుమార్, రుంకాన అరుణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఆక్రమణలు నివారించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ సర్వే నెంబర్ 74లో ఆక్రమణలు నివారించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగర పంచాయతీ బైరెడ్డి వీధికి చెందిన తుర్ల అప్పల నరసయ్య సర్వే నెంబర్ 74లో తనకు పిత్రార్జితంగా వచ్చిన స్థలం ఉందని, ఇదే స్థలాన్ని ఆనుకుని కొంత మంది ఆక్రమించుకొని కట్టాడాలు కడుతున్నారని వాటిని నివరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో నగర పంచాయతీ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. కిల్లంపల్లి రామారావు, ఫిర్యాదు దారుడు అప్పల నరసయ్య మాట్లాడుతూ స్థల ఆక్రమణపై అడిగితే దిక్కున్న చోట చెప్పుకోమని దురుసుగా సమాధానం చెబుతు న్నారని అన్నారు. ఆక్రమణలు నిలుపుదల చేయకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సమస్యలపై మారిక గిరిజనుల వినతి

ప్రజాశక్తి-వేపాడ

రోడ్డు సౌకర్యం కల్పించాలని, పాఠశాల భవనం నిర్మించాలని, తదితర సమస్యలపై మారిక గిరిజనులు కోరారు. గ్రీవెన్స్‌లో ఎంపిడిఒ సూర్య నారాయణకు వినతి అందించారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు. ప్రజలు ఇచ్చిన వినతులపై తగు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ.. సంబంధిత అధికారులకు సూచించారు.

ఎంఆర్‌సి సందర్శన

వేపాడ : మండల విద్యా వనరుల కార్యాలయాన్ని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఎఎంఒ రామారావు, ఐఇ కోఆర్డినేటర్ సూర్యారావు, ఎఎస్ఒ జగన్ సందర్శించారు. అనంతరం ఎంఇఒలు జగదీశ్వర రావు, బాలభాస్కరరావుతోపాటు ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు

క్లాప్‌మిత్ర కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి భోగాపురం

విధుల్లో మృతి చెందిన క్లాప్‌మిత్ర కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సిఐటియు నాయకులు బి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని క్లాప్ మిత్రాలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ గూడెపువలస గ్రామానికి చెందిన బోనెల రామయ్య, లింగాలవలస పంచాయతీలో క్లాప్ మిత్రగా విధుల్లో ఉంటుండగానే ఇటీవల మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఆయన కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం 15వేల రూపాయలు, 10 లక్షలు పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. అనంతరం ఎంపిడిఒ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. క్లాప్ మిత్రాలు డి.సూరి రాములు, బి రాంబాబు, బి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న క్లాప్‌మిత్రాలు

విద్యుత్తు తీగలు తగిలి యువకుడు మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన కోనాడ ఎల్లాజీ (24) విద్యుత్ షాక్‌తో సోమవారం ఉదయం మృతి చెందాడు. తుపాను కారణంగా గాలులకు చెట్లు రాపిడికి ఎల్‌టి విద్యుత్ లైన్ తెగిపోయింది. ఇది గమనించని ఎల్లాజీ ముందు రోజు దేవుడికి పెట్టిన పూలు చెరువులో వేసేందుకు వెళ్లాడు. తెగిపడిన విద్యుత్ తీగను చూసుకోక పోవడంతో అది కాళ్లకు తగిలి షాక్‌కు గురై అక్కడి కక్కడే మృతి చెందాడు. ఎస్ఐ సూర్యకుమారి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ యువకుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎఎస్ఐ తౌడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు

బొబ్బిలి : పోక్సో కేసులో అరెస్టయిన బాడంగి మండం పూడివలస గ్రామానికి చెందిన యువకుడు సరబోను లోకేష్ (19)కి ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి.. ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.4,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. బాడంగి జూనియర్ కళాశాలకు చెందిన బాలిక (17)ను ప్రేమిస్తున్నానంటూ వెంటబడి లైంగికంగా వేధించడం, ఆమె నిరాకరించడంతో కర్రతో కొట్టడంతో లోకేష్‌పై కేసు నమోదు చేసినట్లు బొబ్బిలి రూరల్ సిఐ కె.నారాయణరావు తెలిపారు. నేరం రుజువు కావడంతో లోకేష్‌కు జైలుశిక్ష విధించినట్లు చెప్పారు.

సీతంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎపి కంట్రోల్‌బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ డాక్టర్ బిబి సరిత మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు , ప్రిన్సిపల్ డాక్టర్ డి.రామమూర్తి, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాధ పాల్గొన్నారు.